క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కరీంనగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దవాఖానా ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి, ధర్నా చేపట్టారు. ఏజిల్ సంస్థ మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలనూ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని వాపోయారు.

నేడు ఇంజినీర్స్ డే

విద్యానగర్: ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం సాయంత్రం కరీంనగర్‌లోని శ్వేత హోటల్‌లో వేడుకలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ కన్సల్టెంట్ సీవీఎల్ ఇంజినీర్స్, ఆర్కిటెక్ట్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇ.రాజేందర్, కార్యదర్శి హరికిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం..



ఇంజినీర్లను సన్మానిస్తున్న అలయన్స్ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను గురువారం స్థానిక వాసుదేవ హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, శ్రీనివాస్ గాంధీలను సన్మానించారు. కార్యక్రమంలో అలయన్స్ అంతర్జాతీయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, జిల్లా గవర్నర్ గాలిపల్లి నాగేశ్వర్, స్మార్ట్ సిటీ కార్యదర్శి వల్లపురెడ్డి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విహారయాత్ర



లక్నవరం సరస్సు వద్ద విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు విహారయాత్రకు గురువారం వరంగల్ జిల్లాకు తరలివెళ్లారు. చారిత్రక వరంగల్ కోట, సుందరమైన లక్నవరం సరస్సును సందర్శించారు. విద్యార్థులకు విజ్ఞానం, తెలంగాణ సాంస్కృతిక సంపద, వారసత్వంపై అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు విహారయాత్రకు తీసుకెళ్లినట్లు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

25న టెండర్, హుండీల లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఈ నెల 25న ఉదయం 11 గంటలకు టెండర్, వేలంపాట, హుండీల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో కొస్న కాంతారెడ్డి పేర్కొన్నారు. పూజా సామగ్రి, స్వీట్లు, లడ్డు, పులిహోర అమ్మకం, టీ స్టాల్ నిర్వహణకు టెండర్, వేలంపాటకు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ద్వారా ఉత్తర్వులు పొందినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆలయాల్లో సంప్రదించాలని సూచించారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ యాదవ్

కరీంనగర్ కల్చరల్: యాదవులు రాజకీయంగా ఎదగాలని, జనాభా దామాషా ప్రకారం తమ వాటా దక్కించుకోవాల్సిన అవసరముందని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నగరపు సత్యనారాయణ యాదవ్ అన్నారు. గురువారం చింతకుంటలోని యాదవ సంఘం భవనంలో గ్రామ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం సత్యనారాయణను ఘనంగా సన్మించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జినుక రవీందర్, ఉపాధ్యక్షుడు జిట్టవేణి పర్శరాం, కోశాధికారి బొల్లవేణి నాగరాజు, కార్యవర్గ సభ్యులు జిట్టవేణి మల్లయ్య, బొల్ల వేణి రేణయ్య, గడ్డి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవా'

- 18 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,215 గ్రామాలు

కరీంనగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణతో స్వచ్ఛ గ్రామాలు రూపుదిద్దుకుంటాయని చెప్పిన మహాత్ముడి మాటలే స్ఫూర్తిగా ఆయన జయంతి సందర్భంగా పంచాయతీల్లో 'స్వచ్ఛతా హీ సేవా'కు శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గతేడాది ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా శుక్రవారం నుంచి అక్టోబరు 2 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 1,215 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



దుర్శేడ్‌లో దోమలమందు పిచికారీ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

విజయవంతం చేయాలి

ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో 18 రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రధాన చౌరస్తాలు, ప్రజోపయోగ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల్లో చెత్తాచెదారం తొలగించనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల శ్రమదానంతో పారిశుధ్య పనులను చేపడుతారు. విద్యార్థులకు క్విజ్, స్వచ్ఛత పరుగు పోటీలు నిర్వహిస్తారు. కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్త వేరు చేసి, సేంద్రియ ఎరువు తయారు చేస్తారు. ఈ నెల 17న పంచాయతీ కార్మికులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 2న గ్రామసభ నిర్వహించి, ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేయడంతోపాటు బట్టసంచుల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని స్వచ్ఛ భారత్ మిషన్ కరీంనగర్ జిల్లా కో–ఆర్డినేటర్ రమేశ్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీల మాయలో పడొద్దు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలోనే దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని, ఢిల్లీ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయలో పడొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్, కాసారపు కిరణ్, గండి శ్యామ్‌లతోపాటు 200 మంది యువజన సంఘాలు, తెలంగాణ అంబేడ్కర్ సంఘాల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. 60 ఏళ్ల తెలంగాణ సంపదను దోచుకున్న కాంగ్రెస్, బీజేపీలు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. నీళ్లు, బొగ్గు, కరెంట్, తెలంగాణ సంపదను దోచుకునేందుకే ఆరాటపడుతున్నాయని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులున్నారు.



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్, పక్కన వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు

సుందర నగరంగా కరీంనగర్

కరీంనగర్ కార్పొరేషన్: ఆకర్షణీయ కూడళ్లు.. వెలుగు జిలుగుల వీధిదీపాలతో కరీంనగర్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం నగరంలోని కోర్టు, మంచిర్యాల, గాంధీ, నాకా చౌరస్తాల వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన రూఫ్ హైమాస్ట్ లైట్లను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావులతో కలిసి ప్రారంభించారు. రూ.వేల కోట్లతో నగర అభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు హైలాండ్ జంక్షన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గణేశుడి మట్టి విగ్రహాలను పూజిద్దాం



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి కమలాకర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గోపి

కరీంనగర్‌కల్చరల్: గణేశుడి మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని గాంధీ చౌక్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి ప్రతిమల ద్వారా కలిగే ప్రయోజనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల వాతావరణ నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతిని పూజిద్దాం –పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ గోపి గురువారం ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ గణేశుడి మట్టి విగ్రహాలను పూజించాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, కంకటి అనూప్, మల్యాల వేణుగోపాల్, జంజిరాల వేణు, పాత శ్రీనివాస్, సిరిపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలతో విట్స్ విద్యార్థులు

మట్టి విగ్రహాలతో అవగాహన ర్యాలీ

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం గణేశుడి మట్టి విగ్రహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గణనాథుడి ప్రతిమలతో కళాశాల నుంచి కమాన్ మీదుగా తెలంగాణ చౌక్ వరకు మట్టి విగ్రహాలు ముద్దు–పీవోపీ విగ్రహాలు వద్దు అంటూ నినాదాలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డి.మురళి మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం గణేశుడి మట్టి ప్రతిమలను పూజించాలని కోరారు. అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, ఏవో సుధాకర్‌రావు, ఎం.పవన్‌రావు, కె.లక్ష్మణ్, ఎన్ఎస్ఎస్ పీవో స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాలు కూల్చివేత

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కోతిరాంపూర్‌లో అక్రమ నిర్మాణాలను గురువారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూల్చివేయించారు. 32వ డివిజన్ పరిధిలోని కోతిరాంపూర్‌లో ఇటీవల వివాదాస్పద స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. తమ స్థలంలో పనులు చేస్తున్నారంటూ జిల్లెల్ల జయచంద్ర, ప్రభంజన్‌లు అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ నిర్మాణాలు కొనసాగుతుండటంతో ఇద్దరూ కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చింది. అయినప్పటికీ పనులు ఆగలేదు. దీంతో అధికారులు పట్టించుకోవడం లేదంటూ వారు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు వివాదాస్పద స్థలంలో నిర్మిస్తున్న రెండు ఇళ్లకు సంబంధించిన మెట్లు, ఎలివేషన్, ప్రహరీలను జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. కార్యక్రమంలో ఏసీపీ భానుచందర్, టీపీఎస్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

17న ఎల్ఎండీ వద్ద స్వచ్ఛత లీగ్

కరీంనగర్ కార్పొరేషన్: ఇండియా స్వచ్ఛత లీగ్ కార్యక్రమాన్ని ఈ నెల 17న ఎల్ఎండీ వద్ద నిర్వహిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని తన కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛత లీగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లోని జలాశయాలు, దేవాలయాలు, పార్కులు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం 7.30 గంటలకు నగరంలోని ఎల్ఎండీ వద్ద చేపట్టే స్వచ్ఛత లీగ్‌లో విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. పర్యావరణ ఇంజినీర్ స్వామి, శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, బీఆర్ఎస్ నాయకుడు కన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

'మైనారిటీ బంధు' అర్జీదారులందరికీ ఇవ్వండి

కరీంనగర్‌టౌన్: దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ మైనారిటీ బంధు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.తాజుద్దీన్, టీపీసీసీ కార్యదర్శి సమద్ నవాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మైనారిటీలకు సంబంధించిన పలు సమస్యలపై మెమోరాండం ఇద్దామని మంత్రి కొప్పుల ఈశ్వర్ వద్దకు వెళ్తే తీసుకోకుండా ముఖం చాటేశారని ఆరోపించారు. మొదటి విడత లోన్లు కేవలం బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మైనారిటీ బంధు అందరికీ ఇవ్వకుంటే మంత్రి కొప్పుల ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లయీక్, ధన్నుసింగ్, ఖలీం, సలీం, హనీఫ్, సాజిద్, కరీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాజొద్దీన్, సమద్ నవాబ్

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

సప్తగిరికాలనీ/కరీంనగర్ కల్చరల్: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ పృథ్వీ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర వైద్యశాల, అర్బన్ హెల్త్ సెంటర్ ఆర్గనైజ ర్ ముతేజ్ ఖాన్ ఆధ్వర్యంలో గురువారం కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మానసిక ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. కరోనా తర్వాత పిల్లల్లో చాలా మానసిక సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని అధిగమించాలంటే చిన్న చిన్న టిప్స్ పాటించాలన్నారు. ఒత్తిడిని అధిగమించాలంటే సమయాన్ని, అంకెలను లెక్కించడంతోపాటు చేతివేళ్లు మూస్తూ తెరుస్తూ ఉండాలని తెలిపారు. ఇటీవలి కాలంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, ఒత్తిడే ఇందుకు కారణమని పేర్కొన్నారు. యోగా, ధ్యానంతోపాటు మంచి అలవాట్లు, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేయాలన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. విద్యార్థులు దేనికీ భయపడొద్దని, ఏ చిన్న సమస్య వచ్చినా ఉపాధ్యాయులతో గానీ, తల్లిదండ్రులతో గానీ పంచుకోవాలని పేర్కొన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ బాధ్యుడు హమీద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాపురెడ్డి, బీవీఎస్.స్వామి, రవీందర్, శ్రీలత, జనార్దన్ రెడ్డి, అనిల్, రమేశ్, భద్రయ్య, సుజాత, వెంకటేశ్వర్లు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీ రెడ్డి

విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కరీంనగర్‌రూరల్: విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని గురుకులాల జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ మేరీ ఏసుపాదం అన్నారు. గురువారం నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి, వంట గదులు, లైబ్రరీ, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఆర్‌సీవోను ప్రిన్సిపాల్ శ్రీహరి సన్మానించి, జ్ఞాపిక అందించారు. వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, లైబ్రేరియన్ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆర్‌సీవోకు జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీహరి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మాత్రా కిడికి, శబ్దోంకా చక్రవ్యూహ్, అక్షరోంకా చలనచిత్ర్, లూడ్‌ఖేల్ తదితర మోడల్స్ ఆకట్టుకున్నాయి. హిందీ ఉపాధ్యాయులు షమీమ్ నాజ్, శాంతమ్మ, సంజీవాచారిలను విద్యార్థులు సన్మానించారు.

వర్క్‌షాపును ప్రారంభించిన ఎంఈవో

అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఈవై స్కిల్ బ్రిడ్జ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజెస్ వర్క్‌షాప్‌ను ఎంఈవో ఎం.మధుసూదనాచారి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత, స్టెమ్, కోడింగ్ తదితర ప్రాజెక్టులను పరిశీలించి, సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రాం లీడర్ శృతి, ప్రాజెక్టు మేనేజర్ నఫీజ్ అహ్మద్, జిల్లా కో–ఆర్డినేటర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వింధ్యావ్యాలీ పాఠశాలలో..

సప్తగిరికాలనీ: మెహర్ నగర్‌లోని వింధ్యావ్యాలీ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్ రావు ప్రారంభించారు. భారతీయుల శ్వాసలో ఉన్న భాష హిందీ అన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచీవర్స్‌లో స్కూల్లో..

కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాల విద్యార్థులు హిందీలో తమ భాషా నైపుణ్యాన్ని పాటలు, నాటికల ద్వారా ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హిందీ భాష గొప్పదనాన్ని వివరించారు. మన జాతీయ భాషగా ప్రతిఒక్కరూ హిందీ నేర్చుకొని, మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంఈవో, హిందీ చార్టులను ప్రదర్శిస్తున్న సెయింట్ పాల్స్ స్టూడెంట్స్





వివిధ రాష్ట్రాల ప్రజల వేషధారణల్లో మానేరు విద్యార్థులు, చార్టులను ప్రదర్శిస్తున్న వసంత్‌వ్యాలీ విద్యార్థినులు



వింధ్యావ్యాలీ స్కూల్ విద్యార్థులు..



వేడుకల్లో అచీవర్స్ స్టూడెంట్స్..

మానేరు విద్యాసంస్థల్లో..

కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా వారి వేషధారణల్లో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హిందీ భాష విశిష్టతను వివరించారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ హైస్కూల్లో..

విద్యానగర్: కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని మాట్లాడుతూ.. మన దేశం భిన్న సంస్కృతులకు, భాషలకు నిలయమన్నారు. మాతృభాషతోపాటు జాతీయ భాషను నేర్చుకోవాలని పేర్కొన్నారు. డైరెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ ఒకటన్నారు. విద్యార్థులు హిందీ భాష గొప్పదనాన్ని వివరించే చార్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసంత్ వ్యాలీ పాఠశాలలో..

కరీంనగర్: హనుమాన్‌నగర్‌లోని వసంత్ వ్యాలీ పాఠశాలలో హిందీ దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ ఎ.స్వరూప మాట్లాడుతూ.. మన జాతీయ భాష హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ఈ భాష నేర్చుకుంటే దేశంలో ఎక్కడికైనా వెళ్లి, మాట్లాడవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'వాహనాల దారి మళ్లింపు సరికాదు'

కరీంనగర్: టెట్ రోజు(శుక్రవారం) జగిత్యాల–కరీంనగర్ మధ్య వాహనాలను దారి మళ్లించడం సరికాదని బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం కొత్తపల్లిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం ఉన్నందున జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు, అలాగే కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలను కొత్తపల్లి, రేకుర్తి వైపు రాకుండా చింతకుంట మీదుగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు. దీనివల్ల అదేరోజు టెట్ సెంటర్ రేకుర్తి, కొత్తపల్లిలో పడిన అభ్యర్థులు ఇబ్బంది పడతారన్నారు. కావున పరీక్ష సమయం వరకు వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, యువజన సంఘం నాయకులు అజయ్‌కుమార్, ఆదర్శ్, విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రపై పరిశోధనలు జరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

కరీంనగర్‌సిటీ: శాస్త్రీయంగా చరిత్రపై పరిశోధనలు జరిగాల్సిన అవసరం ఉందని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఎస్సారార్ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'తెలంగాణలో నూతన శా సనాల అన్వేషణ, వెలుగుచూడని తెలంగాణ చరిత్ర' అనే అంశంపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ టీం ఆఫ్ రీసె ర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆర్య మాట్లాడు తూ.. మనకు తెలియని గత వైభవం ఎంతో ఉందని, పరిశోధనల్లో అనేక చారి త్రక వాస్తవాలు బయట పడుతున్నాయని పేర్కొన్నారు. చరిత్ర విభాగాధిపతి కె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు, అకాడమిక్ కో–ఆర్డినేటర్ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.